క్లుప్తంగా

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



రాంచందర్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన రాంచందర్‌రావును శుక్రవారం షాద్‌నగర్ బీజేపీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య ఆధ్వర్యంలో పలువురు నాయకులు నగరంలోని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి నివాసానికి వెళ్లి ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరిభూషణ్, కుర్మయ్య, ప్రశాంత్, రఘురాములు, శ్రీను, నర్సింహ, పద్మ, కృష్ణయ్య, విజయ్‌శంకర్ రెడ్డి, రవి నాయక్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్షలు వెచ్చించారు.. వృథాగా వదిలేశారు



నాగిరెడ్డిగూడ పంచాయతీ భవనం

మొయినాబాద్: రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన పంచాయతీ భవనాన్ని వృథాగా వదిలేశారు. దీంతో ఆ భవనం శిథిలావస్థకు చేరుతుంది. మండల పరిధిలోని నాగిరెడ్డిగూడలో 2013లో రూ.20 లక్షలు వెచ్చించి పంచాయతీ భవనం నిర్మించారు. ప్రారంభోత్సవం తర్వాత కొద్ది రోజులు కార్యకలాపాలు నిర్వహించారు. అనంతరం పాత పంచాయతీ భవనంలోనే కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

షాబాద్ ఏఓ వెంకటేశంకు పదోన్నతి



షాబాద్: మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశంకు ఏడీఏగా పదోన్నతి లభించింది. ఆరున్నర సంవత్సరాలుగా మండల వ్యవసాయ శాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశంకు వికారాబాద్ ఏడీఏగా పదోన్నతి రావడంతో షాబాద్ నుండి వికారాబాద్‌కు వెళ్లారు.

ఓటరు జాబితాపై అప్రమత్తత అవసరం

తహసీల్దార్ రాజేశ్వర్



బీఎల్‌ఓలతో తహసీల్దార్ రాజేశ్వర్

నందిగామ: ఓటరు జాబితాపై బీఎల్‌ఓలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రాజేశ్వర్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో బీఎల్‌ఓలకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజేశ్వర్ మాట్లాడుతూ.. ఓటరు నమోదులు, తొలగింపులు, తప్పుల సవరణ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. బీఎల్‌ఓల అధికారాలు, బాధ్యతలు, విధులు తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్లు లక్ష్మయ్య, బాలవర్ధన్, ఆర్ఐ శ్రీనివాస్ గౌడ్, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య విగ్రహ ఏర్పాటుకు వినతి



మున్సిపల్ కమిషనర్ యోగేశ్‌కి వినతిపత్రం అందజేస్తున్న కురుమ సంఘం నాయకులు

శంకర్‌పల్లి: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని శంకర్‌పల్లి కురుమ సంఘం అధ్యక్షుడు రాజమౌళి అన్నారు. శుక్రవారం దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా పట్టణ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం శంకర్‌పల్లిలో దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ యోగేశ్‌కి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు భిక్షపతి, సెక్రెటరీ సురేశ్, గౌరవాధ్యక్షుడు వెంకటేశం, నాయకులు సత్తయ్య, పాండు తదితరులు పాల్గొన్నారు.

సర్కార్ బడులు.. శిథిల భవనాలు



కొందుర్గు బాలికల ప్రాథమికోన్నత పాఠశాల భవనం దుస్థితి



రామచంద్రాపూర్‌లో గదులు లేక వరండాలో బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

- కురుస్తున్న గోడలు.. పెచ్చులూడుతున్న స్లాబులు
- పాఠశాలలకు పంపేందుకు జంకుతున్న తల్లిదండ్రులు
- పట్టించుకోని అధికారులు

కొందుర్గు: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నాం. మాడల్ స్కూల్స్, ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దుతున్నాం.. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నాం అంటూ ఓ వైపు సర్కార్ చెబుతున్నా.. కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో ప్రభుత్వ పాఠశాల్లో మాత్రం ఇందుకు భిన్నంగా ఉంది. వసతులు లేమితో పాటు పాఠశాల భవనాలు, విద్యాబోధన చేయడానికి ఉపాధ్యాయులు సరిపడా లేరని ఆయాగ్రామాల ప్రజలు వాపోతున్నారు. కొందుర్గు మండలంలో 23 ప్రాథమిక, ఏడు ప్రాథమికోన్నత, రెండు ఉన్నత పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో దాదాపు 2 వేల పైనే విద్యార్థులున్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో 28 ప్రాథమిక, ఏడు ప్రాథమికోన్నత, నాలుగు ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో దాదాపు 2,500 మంది విద్యార్థులున్నారు.

ఎప్పుడు కూలిపడుతాయో..

చాల గ్రామాల్లో పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకుని ఎప్పుడు కూలిపడుతాయో అనే చందంగా మారాయి. కొందుర్గు మండల కేంద్రంలోని బాలికల ప్రాథమికోన్నత పాఠశాల, రామచంద్రాపూర్, లాలపేట, ఆగిర్యాల, జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని చేగిరెడ్డి ఘనాపూర్, ఎల్కగూడ, తూంపల్లి, పద్మారం, పీర్జాపూర్, గుంజల్‌పహాడ్, చలివేంద్రంపల్లి, వీరసముద్రం, రావిర్యాల పాఠశాలల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. తంగెళ్లపల్లి దళితవాడ, రాంజాతండా పాఠశాలలకు భవనాలే లేవు.

పాములు వస్తున్నాయి



మా పాఠశాల భవనం పై కప్పు పెచ్చులూడి పడుతున్నాయి. ఎప్పుడు కూలిపడుతుందో అని భయంతో పాఠశాలకు వస్తున్నాం. పరిసరాలు కూడా చెట్లు, ముళ్ల పొదలతో కమ్ముకున్నాయి. తరగతి గదుల్లోకి విషపూరిత కీటకాలు వస్తున్నాయి.

– సాత్విక, 7వ తరగతి, రామచంద్రాపూర్

అధికారులకు తెలిపాం



పాఠశాల శిథిలావస్థకు చేరిన విషయం అధికారులకు పలుమార్లు చెప్పాం. ఇటీవల కురిసిన వర్షాలకు మా పాఠశాల భవనం పైకప్పు పెచ్చులూడి పడిపోతున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నాం. విద్యార్థులపై శిథిలాలు పడితే ప్రమాదాలు తప్పవు.

– రాములమ్మ హెచ్‌ఎం, యూపీఎస్, రామచంద్రాపూర్

రోశయ్య సేవలు చిరస్మరణీయం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం దివంగత ముఖ్యమంత్రి రోశయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రోశయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా రోశయ్య రాష్ట్ర ప్రజలకు చేసిన సేవలు ఎనలేనివని అన్నారు. రాజకీయాల్లో అత్యున్నత విలువలు కలిగిన వ్యక్తిని కోల్పోవడం బాధాకరమని అన్నారు. క్రమ శిక్షణ కలిగిన కార్యకర్త నుంచి ముఖ్యమంత్రి, గవర్నర్ స్థాయికి ఎదిగిన మహానేత అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, చెన్నయ్య, బస్వం, ఇబ్రహీం, గోపాల్ గుప్తా, శ్రీనివాస్‌గుప్తా, పెంటయ్య, అనిల్‌కుమార్, రవికుమార్, బెజుగం రమేశ్, జగదీశ్వర్, కృష్ణ, శ్రీనివాస్ యాదవ్, అప్పి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి

హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు రవినాయక్



హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఇచ్చిన నోట్ పుస్తకాలు చూపుతున్న విద్యార్థులు

మొయినాబాద్ రూరల్: విద్యార్థులు శ్రద్ధతో చదువుకుని ఉన్నతంగా రాణించాలని హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు మూడే రవి నాయక్ అన్నారు. శుక్రవారం అమ్డాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో ట్రస్ట్ ద్వారా బి.సుచిత్ర సహకారంతో పదోతరగతి విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవినాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని చెప్పారు. ప్రతీ ఏడాది తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో పరీక్ష ఫీజుతో పాటు ఎగ్జామ్ కిట్స్ అందిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రేణుక, ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, అలివేలు, మహేశ్వరి, శంకర్, జ్యోతి, శోభ, సౌభాగ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగిరం చేయాలి

ఎంపీడీఓ వెంకటయ్య



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకయ్య, అధికారులు

శంకర్‌పల్లి: గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు వేగిరం చేయాలని ఎంపీడీఓ వెంకటయ్య అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. స్వచ్ఛ సర్వేక్షణ్–2025, వన మహోత్సవం, గ్రామాల్లో పారిశుద్ధ్యం, రోడ్ల నిర్వహణ, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఆన్‌లైన్‌లో అప్డేట్ చేయడం, డ్వాక్రా సంఘాలకు రుణాలు, పంచాయతీ అవార్డులకు సంబంధించిన తొమ్మిది అంశాలపై చర్చించారు. పంచాయతీ కార్యదర్శులు విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని, అలాంటి వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేకాధికారి సురేశ్ బాబు, ఎంపీఓ గిరిరాజు, ఎంఈఓ అక్బర్, ఏపీఓ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు

మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్



ఘటం ఊరేగింపులో మాజీ ఎంపీపీ, నాయకులు

షాద్‌నగర్: తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బోనాల ఉత్సవాలు అని మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్ అన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్‌లో గంగపుత్రుల సంఘం ఆధ్వర్యంలో గంగమ్మ తల్లి బోనాల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, నాయకులు వెంకట్‌రాంరెడ్డి, శేఖర్, శంకర్, నర్సింహ, రవియాదవ్, భిక్షపతి, శ్రీనివాస్, యాదగిరి, రాఘవేందర్‌గౌడ్, ఎజాజ్, అశోక్, నవీన్ పులిజాల, మంగ శ్రీశైలం, పాండు, సుశాంత్, మల్లేశ్, వెంకటేష్‌గుప్తా, సందీప్‌సింగ్, నవీన్, సాయి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత రేబిస్ వ్యాక్సినేషన్

మొయినాబాద్: ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా ఈ నెల 6న మొయినాబాద్‌లోని పశువైద్య కేంద్రంలో ఉచిత రేబిస్ వ్యాక్సినేషన్ శిబిరం నిర్వహించనున్నట్లు మండల పశువైద్యాధికారి అహ్మద్ తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు రేబిస్ వ్యాక్సినేషన్ శిబిరం ప్రారంభమవుతుందన్నారు. కుక్కలు, పిల్లులు, ఇతర పెంపుడు జంతువులకు రేబిస్ నివారణ టీకా ఇప్పించాలన్నారు. దీంతో జంతువుల నుంచి మనుషులకు రేబిస్ వ్యాధి సంక్రమించకుండా నిరోధించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని పెంపుడు జంతువులు ఉన్నవారు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

బీజేపీ గ్రామాధ్యక్షుడు బీఆర్‌ఎస్‌లో చేరిక



విద్యాసాగర్‌ను బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న సబితారెడ్డి

చేవెళ్ల: వచ్చేది మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని.. పార్టీ పటిష్టకు కలిసికట్టుగా పనిచేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని బీజేపీ రామన్నగూడ గ్రామాధ్యక్షుడు పెద్దోళ్ల విద్యాసాగర్ శుక్రవారం నగరంలోని సబితారెడ్డి నివాసంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ మేరకు సబితారెడ్డి ఆయనకు కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పి.ప్రభాకర్, రామన్నగూడ బీఆర్‌ఎస్ నాయకులు మాజీ ఉప సర్పంచ్ పి.సుదర్శన్, మాజీ వార్డు సభ్యుడు మల్లేశ్, సీనియర్ నాయకులు నర్సింలు, శ్రీధర్ తదితరులున్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న లక్ష్మి

మొయినాబాద్‌రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలల్లో నాణ్యమైన పౌష్టికాహారం లభిస్తుందని అంగన్‌వాడీ టీచర్ల సంఘం మండల కార్యదర్శి లక్ష్మీ అన్నారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లో పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించి వారి ఆరోగ్యానికి కావాల్సిన నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం నుంచి బాలామృతం, గుడ్లు, పాలు అందజేస్తామన్నారు. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం ఝాన్సి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మనిషి దొడ్డి కొమురయ్య

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తొలి అమరుడుగా చరిత్రకెక్కిన మహనీయుడు దొడ్డి కొమురయ్య అని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శుక్రవారం దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పలువురు పూలమాల వేసి నివాళి అర్పించారు.

– చేవెళ్ల, షాబాద్



చేవెళ్ల: దొడ్డి కొమురయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తదితరులు



చేవెళ్ల: నివాళులర్పిస్తున్న డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు



షాబాద్: నివాళి అర్పిస్తున్న కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింలు తదితరులు

బడుల బలోపేతానికి దాతల సహకారం అవసరం

షాబాద్ ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్



దాతలు అందించిన షూతో విద్యార్థులు

షాబాద్: పేద విద్యార్థులకు సహకారం అందించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని షాబాద్ ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కుమ్మరిగూడ ప్రాథమిక పాఠశాలలో అదే గ్రామానికి చెందిన దాత పెద్దగొల్ల లక్ష్మణ్ విద్యార్థులకు ఉచితంగా షూ , తాళ్లపల్లి, చందనవెల్లి, హైతాబాద్, రుద్రారం, వెంకమ్మగూడ, ప్రభుత్వ పాఠశాలల్లో బొంతపల్లి రాములుగుప్తా, మల్లమ్మ గుప్తా జ్ఞాపకార్థం వారి కుమారులు వీరయ్య గుప్తా, వీరశంగుప్తా వేయి మంది విద్యార్థులకు స్టేషనరీ సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు దాతలు ముందుకు వచ్చి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు రామగణేశ్, విష్ణువర్ధన్‌రెడ్డి మాజీ చైర్మన్ నర్సింలు, సీఆర్‌పీ లింగం, మాజీ సర్పంచ్‌లు ప్రభాకర్‌రెడ్డి, నర్సింలు, అడ్వకేట్ బాలకృష్ణ, కర్ణాకర్, పూర్ణచందర్, శ్రీనివాస్, సుధాకర్, యాదగిరి, సమద్, వెంకటేశ్, బాలరాజు, కవిత, సుజాత, ఉపాధ్యాయులు కిరణ్మయి, సంగమేశ్వర్‌రెడ్డి, నాగిరెడ్డి, గ్లోరి, మంజుల, శోభారాణి, మొగులయ్య, బాలకృష్ణ, లలిత, దుర్గాభవనాఇ, సీతాభాయ్ తదితరులున్నారు.

యువతరానికి స్ఫూర్తి వివేకానందుడు



వివేకానంద విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు



నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

భారత దేశ సంస్కృతి, యువ శక్తిని ప్రపంచానికి చాటిన మహనీయుడు స్వామి వివేకానంద అని పలువురు నేతలు అన్నారు. శుక్రవారం ఆయన వర్ధంతి సందర్భంగా నాయకులు, యువత వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. – చేవెళ్ల

భక్తి శ్రద్ధలతో వారాహి అమ్మవారి నవరాత్రులు

మీర్‌పేట: వారాహి అమ్మవారి నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం మీర్‌పేటలోని కాశీ నర్మదేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని శాకాంబరి దేవి రూపంలో అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్‌నగర్: ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే, నాయకులు

షాద్‌నగర్: దేశంలో సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం నగరంలోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుల సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా విచ్చేసిన ఈ సభకు షాద్‌నగర్ నుంచి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో సుమారు మూడు వేల మంది కార్యకర్తలు ఆరు వందల వాహనాల్లో తరలివెళ్లారు. ఈ సందర్భంగా పట్టణంలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. సభకు తరలివెళ్లిన వారిలో నాయకులు బాబర్‌ఖాన్, రఘు నాయక్, శ్రీకాంత్‌రెడ్డి, విశాల, శ్రావణ్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, బస్వం, అందె మోహన్, శివశంకర్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

చేవెళ్ల నుంచి..

చేవెళ్ల: నగరంలోని ఎల్బీ స్టేడీయంలో నిర్వహించిన కాంగ్రెస్ గ్రామాధ్యక్షుల ఆత్మీయ సమ్మేళనానికి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. శుక్రవారం ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆధ్వర్యంలో పార్టీ మున్సిపల్, మండల నాయకులు పెద్ద సంఖ్యలో బస్సుల్లో బయలు దేరారు.

షాబాద్: కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం సాధ్యమని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం షాబాద్ నుంచి సామాజిక న్యాయ సమర భేరి సభకు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యులు చెన్నయ్య, అశోక్, నాయకులు రాహుల్‌గుప్తా, చేవెళ్ల స్వామి తదితరులున్నారు.

మొయినాబాద్ రూరల్: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమ సాధ్యమని కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీమ్‌భరత్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొత్త జైపాల్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్ అన్నారు. శుక్రవారం నగరంలో నిర్వహించిన ఖర్గే సభకు మండల పరిధి నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలివెళ్లాయి. ఈ సందర్భంగా వాహన శ్రేణులకు భీంభరత్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, సంజీవరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మానయ్య, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట: నగరంలోని ఎల్‌బీ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిప కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుల సమ్మేళనానికి మండలం నుంచి నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూడ వీరేష్ ఆధ్వర్యంలో ఏఎంసీ డైరెక్టర్లు భాస్కర్‌గౌడ్, కరుణాకర్, నాయకులు రాణి, గోపాల్, రమేష్, శ్రీనాథ్, సురేశ్ తదితరులు వెళ్లారు.



షాబాద్ నుంచి వెళ్తున్న పార్టీ నాయకులు



కేశంపేట: సమ్మేళనానికి తరలివెళ్లిన నేతలు



మొయినాబాద్‌రూరల్: హిమాయత్ నగర్ నుంచి వెళ్తున్న పార్టీ శ్రేణులు